# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు దావోస్ లో పర్యటిస్తున్నారు.
- ❖ పంచాయతీరాజ్ శాఖ సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా పశుఆరోగ్య శిబిరాలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ప్రారంభించారు.
- ❖ ప్రజా సమస్యలు పరిష్కరించటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.
- ❖ మహా కుంభమేళా కోసం తూర్పు కోస్తా రైల్వే తిరుపతి - బెనారస్ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చంద్రబాబు నాయుడు ఈరోజు దావోస్ లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటన లో భాగంగా జ్యూరిచ్ లోని హిల్టన్ హోటల్లో భారత రాయభారి మృదుల్ కుమార్‌తో సమావేశమయ్యారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి బృందం సమావేశమైంది. కాగా దావోస్ పర్యటనలో భాగంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, అధికారుల బృందం జ్యూరిచ్ వెళ్లారు. జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి బృందానికి ప్రవాసాంధ్రులు ఘన స్వాగతం పలికారు.

========================

పంచాయతీరాజ్ శాఖ సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టి, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని చెప్పారు. ఈరోజు ఆయన పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగిన సంఖ్యలో సిబ్బంది కొరత లేకుండా కొత్తవారిని నియమించుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

========================

ప్రజా సమస్యలు పరిష్కరించటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా వేదికల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ సమస్యలు, ఇళ్ళ పట్టాలు, పెన్షన్ లు, టిడ్కో గృహాలు, రహదారులు, తాగునీటి సమస్యల అర్జీలు అందాయని మంత్రి తెలిపారు. పరిష్కారం కాని సమస్యలను అధికారులతో మాట్లాడి ప్రాధాన్యత పరంగా పరిష్కరించాలని ఆమె సూచించారు.

(వాయిస్ 18 సెకన్లు)

========================

రాష్ట్రంలో పశుపోషకులకు పశుసంవర్ధక శాఖ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతోనే ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి 31వ తేది వరకు నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయంతో పాటు పశు పోషణ చాలా ముఖ్యమని అన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ, ఉత్పాదకత పెంచటానికి, వ్యాధులను నియంత్రించడానికి పాడి రైతులకు ఈ పశుఆరోగ్య శిబిరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 వేల 200 గ్రామాల్లో ఈ పశు వైద్య శిబిరాలను నిర్వహించటం జరుగుతుందని అచ్చెన్నాయుడు వివరించారు.

========================

విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఈరోజు బొండపల్లి గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జీవన రాణి సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇద్దరు వైద్యాధికారులతో డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రుల్లో పలువురు చికిత్స పొందుతున్నారు. మండలంలోని బిల్లలవలస గ్రామంలోనూ పలువురు డయేరియాతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతున్న వారంతా కోలుకుంటున్నారని, డయేరియా ప్రబలడానికి కారణాలు తెలుసుకుంటున్నామని, మరింత మందికి విస్తరించకుండా చర్యలు చేపడుతున్నామని డాక్టర్ జీవనరాణి తెలిపారు.

========================

మహా కుంభమేళా కోసం తూర్పు కోస్తా రైల్వే తిరుపతి - బెనారస్ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 07107 నంబరుతో ఈ ప్రత్యేక రైలు తిరుపతి బెనారస్ మధ్య ఫిబ్రవరి 8, 15, 22 తేదీల్లో అందుబాటులో ఉంటుంది. తిరుగు పయనంలో

07108 నెంబరుతో బెనారస్ - విజయవాడల మధ్య 10, 17, 24 తేదీల్లో ఈ రైలు సర్వీసులను అందించనుంది. ఈ ప్రత్యేక రైలు ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి, గూడూరు, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, దువ్వాడ, విజయనగరం నగరాల మీదుగా ప్రయాణిస్తుంది.

విరామం

========================

ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా నేలపట్టు పక్షుల అభయారణ్యాన్ని సందర్శించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి జిల్లా తడ మండలం పరిధిలోని నేలపట్టు పక్షుల అభయారణ్యాన్ని కలెక్టర్ సందర్శించి పలువురు విద్యార్థులు, పర్యాటకులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలు వారి అనుభూతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... పులికాట్ సరస్సులో  పెలికాన్ పక్షులు చేపలను ఆహారంగా తీసుకొని సంతతిని పెంపొందించుకొని తిరిగి వాటి సొంత ప్రాంతాలకు వెళ్తాయని తెలియజేశారు. నేలపట్టు పక్షులు అభయారణ్యాన్ని అందరూ సందర్శించి ప్రకృతిని ఆస్వాదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ పులికాట్ సరస్సు ఒక విలక్షణమైన పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని.. దీనిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం లోని పలు గ్రామాల్లో 10 కోట్ల రూపాయల వ్యయంతో సిమెంటు రహదారులు, డ్రైన్లు, మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి పనులకు ఈరోజు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం ద్వారా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను రప్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. 5 సంవత్సరాల పాలనలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంలో భాగంగా యువతకు అధిక ప్రాదాన్యత ఇస్తున్నామని మంత్రి రామానాయుడు వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

కేసుల పరిష్కారానికి మీడియేషన్ ఒక మంచి మార్గమని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్ చార్జ్ ఛైర్మన్, ఫ్యామిలీ కోర్ట్ జడ్జ్ అమ్మన్నరాజా అన్నారు. మీడియేషన్ పై ఏర్పాటు చేసిన 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని ఒంగోలు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన మీడియేషన్ శిక్షకులు జయా గోయల్, నగీనా జైన్ వివిధ అంశాలపై 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్ చార్జ్ ఛైర్మన్ అమ్మన్నరాజా పాత్రికేయులతో మాట్లాడుతూ... భవిష్యత్ లో కేసుల పరిష్కారంలో మీడియేషన్ పాత్ర పెరుగుతుందన్నారు. ఈ 40 గంటల శిక్షణా కార్యక్రమంలో వీరికి శిక్షణతో పాటు సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.

========================

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల దృష్ట్యా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. కైలాసగిరులపై కొలువుదీరిన శివపార్వతుల విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లేజర్ షో ట్రయిల్ వర్షన్ ను ఈరోజు ఆయన వీక్షించారు.

========================

========================